# "ఆన రాకుంటె పానం బొయ్యేదే.....!"

జాజిరో జాజిరో జంబి నాగండ్లు
చక్కంగ దున్నరా సాయిరెడ్డి కొడుకా
ఇంకెట్ల దుంతర్ర కుక్కలా కొడుకా
వలుప బెద్దునూ దాపల గట్టి
దాపటెద్దునూ వలుపల గట్టి
ఆం అంటే అరువై పుట్లూ
ఉం అంటే ఇరవై పుట్లూ
కొట్టి పోసుకపాయె కొండయ్యా పంతులు
తిట్టిపోసుకపాయె తిమ్మయ్యా పంతులు
జాజిరి జాజా..... జాజిరి జాజా...

కథా నిలయం
979
శ్రీకాకుళం

కామునిపున్నం ముంగట గీ పాటను పొల్లగాండ్లు పాడుతుంటరు... "గీ పాటిన్నప్పుడల్ల నాకు మా సిన్నాయిన్న యాదికత్తడు... అయినె సెప్పిన కతలు యాదికత్తయి". తొడల మీద కూసుండవెట్టుకొని ఎవుసదారుని కష్టాల గురించి సెప్పింది కండ్లముందట కదుల్తది. నామనసంతెట్లనో అయితది ఓనాడు మక్కసెరడికాడ సిన్నాయిన్న నేను పచ్చికంకులు కాల్చుకోని తినుకుంట కూసున్నం.

"కొడుకా! గీ ఎవుసంల అరువకట్టం జేసినా గీ బొక్కలే మిగుల్తన్నయి. కట్టపడి ఆర్నెల్లు మట్లె మన్నె పండిత్తె అప్పులోడచ్చి కల్లంమీదనే కొలుసుకపోతడు. ఎవ్వలకిచ్చేటి యాల్లకియ్యాలె. అందరికి పొంగ ఎవుసం జేసెటోనికి దినం కయికిలి గిడితెక్కనే. కాసిగద్ద కొట్టకుంట సాదుకున్న పంట మాకు దక్కుడే కట్టమాయితంది. కని బూమినే నమ్ముకోని బతుకుతున్న మేం ఇంకేం పనిజేత్తం సెప్పు! నువ్వు మంచిగ సదువుకోని పైకిరా. పెద్ద నౌకరి దొరికిచ్చుకో" అని సెప్పిండు.

మల్లోసారి దగ్గెర కూసొవెట్టుకొని సెప్పిండు. "బిడ్డా! నీకు గివ్వన్నేమెరుకగని ఎనుకట మేమెన్ని సూసినం? ఎన్ని కట్టాలు పడ్డం? నైజామోని కాలంల తురుకోడంటె ఒంటెల్లు పడేది. తాసిల్దార్ ఊళ్ళెకత్తండంటె ఊరవతలిదాకురికి ఎదురుకోవాలె. గిరుదవరి ఊళ్ళెకచ్చినా మస్తుసాగిచ్చుకునెటోడు. కోడి కనవడితె పట్టుకపోవుడే. సుంకరోడు, సెపరాశి కూడ మా అసొంటోల్లమీన జెబరదస్తి సేత్తురు.

పట్వారింట్ల, పటేలింట, దొరలిండ్లల్ల ఏకార్యమయినా ఊరుమీన్నే పైసలు వసూలు జేసెటోల్లు. తాసీలుగట్టె యాల్లచ్చిందంటె మా నాయిన్న సుంకరోల్ల కండ్ల వడకుంట జాగుండెటోడు. గప్పుడు పైసేడ దొరికేది బిడ్డ? తాసీలుగట్టుడు సాతగాక, సానమంది బూములిడిసి పెట్టుకున్నరు.

ఎంత మొత్తుకున్నా ఇనక సుంకరోడు సేతికచ్చింది కొంచవొయ్యేటోడు. ఓ పారొపారి నాగటెడ్లను పట్టుకపొయ్యి కచ్చీరుకాడ కట్టేసెటోల్లు. గట్ల సాగిచ్చుకున్నరాల్లు. తాపకోసారి దేశ్ముఖచ్చేటోడు. గయినె వత్తండని తెలిత్తెనే ఊరోల్లంత ఊరిపొలుమారదాక పొయ్యి ఎదురుకునెటోల్లు. అయినె గుర్రంమీదత్తంటె అందరు నడుసుకుంటచ్చెటోల్లు. దొరలిండ్లల్ల ఎట్టి మొన్న మొన్నట్దాక సాగనేసాగె. సిన్నసిన్నెవుసాలు గప్పట్నుంచే మూలవడి బూమంత కొందరు సేతల్లకు పెయింది. నైజాంబోయినా గని రాజ్జెం ఎవ్వలేలినా మనసొంటోల్ల బతుకులు గింతే ఉన్నయి బిడ్డ".

జాజిరపాటల సెప్పినట్టు అరవై ఇరవై పుట్లు పండిచ్చినా గని కొట్టితిట్టి పొసుకపెయిన కొండయ్య, తిమ్మయ్య పంతులెవ్వరో నాకు సిన్నాయిన్న మాటలతోని కొద్దికొద్ది గరుతమయ్యేది. ఆ పాటలో నాకు సామాజికత కనవడ్డది.

నేను మా ఊల్లె సదువుకునెటప్పుడు ఓపారి ఎకంట్రమడనే శారదికాడచ్చిండు. ఆడు మంచిమంచి కతలు మస్తుగ సెప్పెటోడు. ముగ్గురు మరాటీల కత, రజాకార్ల నెదిరించిన గట్టాపిల్లి మురలయ్యకత, రాంసెంద్రారెడ్డికత సానబాగ సెప్పెటోడు. మురలయ్య పద్ద కట్టాల గురించి రజాకారు పోలీసోల్ల నుంచి తప్పించుకునుటానికేసిన మారువేషాల గురించి సెప్పుతంటె రోమాలన్ని నిక్కబొడిసేటియి. మూడు బజార్లకాడ ఎంట్రామడు సెప్పే కత ఇనచ్చినంక సిన్నాయిన్న నన్ను దగ్గిర కూసుండవెట్టుకొని రజాకార్ల గురించి గిట్ల జెప్పిండు.

"కొడుకా! గప్పుడు నువ్వింక పుట్టలే. ఖాసిం రజ్వానెటోడు రజాకార్ల ఫౌజును నడిపిచ్చెటోడుండె. గాడు పచ్చినెత్తురు దాగె పెద్దపులసొంటోడు. గప్పుడు తెలంగాణ గడ్డమీదున్నోల్లంత పానాలరసేతిల వెట్టుకొని బతికింద్రు. గా నల్లగొండ దిక్కయితె ఆడోల్లను బట్టలిడిపిచ్చి బరివాత బతుకమ్మాడిపిచ్చింద్రు. జుట్టు పన్నని పసింద్రు. ఊచకోత ఏసింద్రు. గందురగోల జేసింద్రు. దొరలు, పెద్ద పెద్దోల్లంత ఆల్లకే సాయం జేసింద్రు. పేదోల్లంత కుడిదిల వడ్డ ఎలుకలోలె గిజగిజ తన్నుకున్నరు. రజాకార్లకు, దొరలకు ఎదురుగ కొంతమంది కొట్లాడింద్రు. పానాలిడిసింద్రు. కని అల్లు మాత్తురమట్లనే సాగిచ్చుకున్నరు.

ఎదురుగ మాట్లాడినోన్ని సంపుడు, ఆడోల్లను మానభంగం జేసుడు, ఇండ్లమీన పడి దోసుకునుడు గిట్ల మనుషులను కాల్సుకతిన్నర. ఖాసిం రజ్విగాడు ఎంతమందిని వీలయితె గంతమందిని కోసి సంపుటానికి ఫౌజును తయ్యారుజేసిండు. ఫౌజంత పట్నం నుంచచ్చి అనాడు

నాత్రికి నాత్రే కోసం తెల్లారెవారకు పనికతం జేసుకోవన్నని అనుకున్నరట. జెనమంత గజ్జగజ్జనుక్కుంట పానాలరసేతిల వట్టుకొనున్నరు. తెల్లరెవారకెంతమంది పీనుగులైతరో అనుకుంటన్నరు. ఒగలను పట్టుకొనొగలం కంటికో కడివేడ్సినం.

ఆనాడు వానదేవుడు దయజూపకుంటె తెలంగానంత తెల్లారెవారకు పీనులుగతోని నిండేటిది. ఆనరాకట పానంబోకట తెలువదంటరు గందుకనే. రజాకార్లు పట్నంల బైలెల్న యాల్లకే తలగిచ్చుకుంది వాన. కుడపోతగ మొదలైంది. మొగులుకు సిల్లులు వడ్డట్టు కొట్టింది కొట్టినట్టే వాన. తెల్లందాక బూదావెర, ఆకాశెం ఒక్కటైనట్టు కొట్టుడే కొట్టుటు వాన. ఇగ గప్పుడు తెల్లారెవారకు డిల్లినుంచి పటేలు పౌజు పట్నంల దిగిందన్నరు. పులసోంటి నైజామోడు పిల్లోలె లొంగిపెయిండు. ఎక్కడోల్లక్కడ రజాకార్లు ఆగిపెయింంద్రు. ఇగప్పుడు తెలుగోల్లు తెగిచ్చింద్రు. ఆల్లు కనవడితె నరికిండ్రు. ఆల్ల ఆడోల్లను పాడుజేసింద్రు. ఇట్టమున్నట్టు గందురగోలం జేసింద్రు. గిసోంటియి కొడుకా. ఆల్లకయిన మంచిది గాదు. మనకయిన మంచిది గాదు. కని గట్ల జరిగింది కొడుక.

కని గీ మాయంతేందో తెలువలే నాకు. రజాకార్లు పెయింద్రు నిజమే కని అంతకుముందు కమినిస్టోల్లకు బయపడి ఊళ్ళిడిసిపెట్టిపోయిన దొరలు, పటేలు సైన్యం రాంగనే ఊళ్ళల్ల కచ్చింద్రు. కొన్ని రోజులు దొరలు బయటపడ్డట్టున్నరు. కని అటెనుక మస్తు సాగిచ్చుకునుడు మొదలువెట్టిండు. ఇంకా సాగిచ్చుకుంటంద్రు. గిట్ల మా కాలంల ఎన్నో కట్టాలు పడ్డం బిడ్డ. బతుకన్నంటె అన్నిట్ని ఎదుర్కొని నిలువాలె బిడ్డ. ఎనుక ముందన్ని తెలుసుకోని మెదులాలె.

గిట్ల ఎన్నో సంగతులు సెప్పెటోడు మా సిన్నాయిన్న ఇప్పటిగ్గూడ కొన్ని కొన్ని సంగతులు సెప్పుతడు. ఎనుకటి సంగతులింటంటె ఎంతో ఆశ్చెర్యమనిపిత్తది. గొర్రెలసోంట మాయికులనుకునే నా తెలంగాణోల్లు నైజామునెదిరించుడు, భూములు పంచుకునుడు వింటంటె ఆశ్చెర్యంగుంటది. వాళ్ళే మల్ల దొరల అధికారాలకు తలవంచుడు, అటెనుక తుపాకుల కెదురునిల్సి పోరాడుడు మరింత వింతనిత్తది. అయితే తెలంగాణాల గిప్పుడున్న గీ పోరాటాలకు బీజలు మాత్రం తెలంగాణ పోరాటంలనే ఉన్నయని అర్థమైతది.

★★★